సాక్షి
జోగుళాంబ గద్వాల
మంగళవారం । 23 । జనవరి । 2024



ముగిసిన బ్రహ్మోత్సవాలు

నల్లమలలో ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి.

వివరాలు 12లో ▸



నాణ్యతకు తిలోదకాలు

అలంపూర్ ఆలయాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు.

వివరాలు 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.1/22.4

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.7,277

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 1053 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ. 7277, కనిష్ఠం రూ.3869, సరాసరి రూ. 5857 ధరలు పలికాయి. అలాగే, 4క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్ఠం, కనిష్ఠం, సరాసరి రూ. 5305 ధర వచ్చింది. 12 క్వింటాళ్ల కంది రాగా గరిష్ఠం రూ.9344, కనిష్ఠం రూ. 9279, సరాసరి రూ. 9339 ధరలు పలికాయి. క్వింటా వరి (సోన) రాగా గరిష్ఠం, కనిష్ఠం, సరాసరి ధర రూ. 2281 ధర వచ్చింది. 35 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా గరిష్ఠం రూ. 1500, కనిష్ఠం రూ. 6000, సరాసరి రూ. 10000 ధరలు పలికాయి.

చిన్నరాజమూర్ అంజన్నకు అభిషేకాలు



దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూరులో వెలసిన ఆంజనేయస్వామికి సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సం, బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించి అలంకారం చేశారు. పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి మహా మంగళ హారతి ఇచ్చారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించారు.

మరొకరికి పాజిటివ్

పాలమూరు: కొత్త రకం వేరియంట్ వైరస్‌తో కరోనా పాజిటివ్ కేసులు స్వల్పంగా పెరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో సోమవారం పలు రకాల లక్షణాలు కలిగిన 101 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా జిల్లాకేంద్రానికి చెందిన ఓ యువతికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. అయితే స్వల్ప లక్షణాలు ఉండటంతో హోం ఐసోలేషన్‌లో ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ వెల్లడించారు. ఇక ఇప్పటి వరకు జనరల్ ఆస్పత్రిలో 1,865 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా.. దీంట్లో 24 మందికి పాజిటివ్ వచ్చింది. బాధితులు అందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స పొందుతున్నారు. పాజిటివ్ వచ్చిన వారిలో కొంత మహబూబ్‌నగర్ జిల్లా వారు ఉండగా మరికొందరు నారాయణపేట జిల్లావాసులు ఉన్నారు.

నిండుగా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కుల వరద వస్తుండగా.. సమాంతర కాల్వకు నీటి సరఫరా నిలిపి వేసినట్లు చెప్పారు. ఎన్టీఆర్ కాల్వకు 800 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు.

లింగాకర్షక బుట్టలతో చీడపీడల నివారణ

తాడూరు: పత్తిపంటలో లింగార్షక బుట్టల ఏర్పాటుతో చీడపీడలను నివారించవచ్చని రావేఫ్ విద్యార్థినులు అన్నారు. తాడూరు మండలం యత్మతాపూర్‌లో సోమవారం పాలెం కేవీకే విద్యార్థినులు లింగార్షక బట్టలపై రైతులకు అవగాహన కల్పించారు. లింగాకర్షక బుట్టను క్రిమీ కీటకాలను ఆకర్షించడానికి ఉపయోగిస్తారన్నారు. దీంతో పురుగుల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. పంటకు అడుగు ఎత్తులో కర్రను పాతి బుట్టలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థినులు రమ్య, సాయినవత, సానియా, ఫాతిమా, సింధూర పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కుదేలు

- ఇసుక కొరతతో ముందుకు సాగని పనులు
- మందగించిన సామగ్రి అమ్మకాలు
- పూటగడవక కూలీల అవస్థలు

- మహబూబ్‌నగర్ న్యూటౌన్

- వివరాలు 10లో..

అంతటా రామనామమే..

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠతో ప్రత్యేక కార్యక్రమాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలు
- పట్టణాలు.. గ్రామాల్లో కనులపండువగా శోభాయాత్ర
- జిల్లాలో అంబరాన్నంటిన సంబరాలు



ఉండవెల్లి మండలంలో రాములోరి విగ్రహాల ఊరేగింపులో ఎమ్మెల్యే విజేయుడు



అయిజలో దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

గద్వాల/ధరూరు/ఉండవెల్లి: కోట్లాది మంది భారతీయుల ఎన్నో ఏళ్ల కల అయోధ్యలో రామమందిర నిర్మాణం. రామ జన్మభూమిలో అయిదు శతాబ్దాల ఆకాంక్ష సాకారం అయిన శుభ ఘడియలో రామ భక్తుల హృదయాలు పులకించాయి. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక ఉత్సాహం ఉరకలేసింది. శ్రీరాముడు అయోధ్యలో కొలువుదీరాడన్న ఆనందం పెల్లుబికింది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడచూసినా అంతా రామమయమే.. రెండు రోజుల నుంచే జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఎటు చూసినా ఒకటే నినాదం, ఎవరి గొంతులో విన్న ఒకటే భావోద్వేగం..జై శ్రీరామ్.. జై శ్రీరామ్.. సోమవారం అయోధ్యలో బాల రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో చేపట్టిన సంబరాలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. హిందూ ధార్మిక సంఘాలు, ఆయల కమిటీలు, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వేరువేరుగా బాల రాముడి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పండగ వాతావరణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అభిషేకం, యజ్ఞం, హోమాలు, దీపోత్సవాలు, రథోత్సవం తదితర పూజా కార్యక్రమాలను చేపట్టారు. గత రెండు రోజులుగా నియమనిష్ఠలతో రామున్ని ఆరాధించే కార్యక్రమాలను ప్రతి ఇంట నిర్వహించారు. భజనలు, డీజే పాటలతో హోరెత్తించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి వేర్వేరుగా ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆలయం దగ్గర భక్తులకు అన్నదానం చేపట్టారు.

పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు

బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠని పురస్కరించుకొని జిల్లాలోని పలు పాఠశాలలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. రాముడి వేషధారణతో పలువురు చిన్నారులు ఆకట్టుకున్నారు. పాఠశాలల నిర్వాహకులు సైతం పలు పాఠశాలలో ఎల్ఈడీ స్క్రీన్లను, టీవీలను ఏర్పాటు చేసి అయోధ్య జరిగే ఉత్సవాల ప్రత్యక్ష కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో సైతం పండగ వాతావరణం నెలకొంది.

ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం..

ఉండవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించి ఎల్ఈడీ స్క్రీన్లపై భక్తులకు ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యేక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. పుల్లూరులో ఎమ్మెల్యే విజేయుడు రాములవారి కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాగటూరులోని ఆలయంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రసారం అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

యువత సంబురం

అయోధ్య రామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ధరూరులో సోమవారం సాయంత్రం శోభాయాత్రక కనుల పండువగా జరిగింది. స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గట్టు బస్టాండ్, పాత బస్టాండు, కొత్త బస్టాండు మీదుగా యాత్ర కొనసాగింది. మండలంలోని బూరెడ్డిపల్లి ఆలయం వద్ద జై శ్రీరాం ఆకారంలో వెలిగించి దీపాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి యువత సంబరం చేకున్నారు. కార్యక్రమంలో బండ్ల రాజశేఖర్‌రెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చేర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న భక్తులు



గద్వాలలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



జిల్లా కేంద్రంలో కాషాయ జెండాలతో యువకుల ర్యాలీ

శోభాయమానం శ్రీరాముడి శోభాయాత్ర

అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి చేపట్టిన శోభయాత్ర వైభవంగా సాగింది. భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్, దర్మ ప్రసార సమితి, బీజేపీ నాయకులతో పాటు ఏబీవీపీ విద్యార్థులు, వివేకానంద సేవాదళ్, వివిధ ధార్మిక సంఘాలతో గద్వాల పట్టణం కాషాయరంగును సంతరించుకుంది. 'జై శ్రీరామ్..జై శ్రీరామ్..' అని కీర్తిస్తూ, పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక పాండురంగ శివాలయం నుంచి శోభయాత్ర ప్రారంభమై కోటలోని చెన్నకేశవస్వామి ఆలయం వరకు ప్రధాన రహదారుల వెంట సాగింది. జై శ్రీరామ్ నినాదాలతో పట్టణం మార్మోగింది. వందలాది మంది యువకులు కాషాయ వస్త్రాలతో శోభయాత్రలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను పురష్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాములను అందంగా ముస్తాబు చేసి వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అదిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయాన్నే భక్తులు బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించిను సీతారాముల కల్యాణంలో పాల్గొని కనులారా తిలకించారు. భక్తులకు ఆలయ పాలక మండలి ఆద్వర్యంలో అన్నదానం చేసినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

గద్వాల: 2023–24 రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గతనెల ఆన్‌లైన్ వేదికగా జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కోసం పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు తమ ప్రదర్శనలను ఆన్‌లైన్‌లో ప్రదర్శించారు. ఏడు విభాగాలలో పోటీలను నిర్వహించారు. సీనియర్, జూనియర్ స్థాయిలో ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన పది మంది విద్యార్థులతో పాటు సెమినార్ నుంచి ఒకరు, టీచర్ ఎగ్జిబిట్ నుంచి ఒకరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి బాస్కర్‌పాపన్న తెలిపారు.

విజేతలు వీరే..

సీనియర్స్ విభాగంలో ఆరోగ్యం అనే అంశంపై గాయత్రి (ప్రగతి విద్యానికేతన్) జూనియర్స్ విభాగంలో అనిరుధ్ (నోబుల్ స్కూల్), సీనియర్స్ విభాగంలో పర్యావరణం కోసం జీవనశైలి అనే అంశంపై శివసాయి (గద్వాల బాలురు పాఠశాల), జూనియర్స్ విభాగంలో మనోజ్‌కుమార్ (గద్వాల అభ్యసన పాఠశాల), సీనియర్ విభాగంలో సమాచార ప్రసారం, రవాణా అనే అంశంపై అద్దంకి అరవింద్ (అక్షర స్కూల్), జూనియర్ విభాగంలో మహేంద్ర (ధరూర్), సీనియర్స్ విభాగంలో వ్యవసాయం అనే అంశంపై కృష్ణవంశీ (నోబుల్ స్కూల్), జూనియన్స్ విభాగంలో స్రవంతి (సరస్వతీ టాలెంట్ స్కూల్), సీనియర్స్ విభాగంలో తార్కిక ఆలోచనలు అనే అంశంపై ఈశ్వర్ (శివ శివాని స్కూల్), జూనియర్స్ విభాగంలో ఆర్థి (శారద విద్యానికేతన్), సెమినార్ విభాగంలో చిరుధాన్యాలు– సుస్థిరమైన పుడమికోసం అనే అంశంపై శివసాయి (గద్వాల బాలురు పాఠశాల), టీచర్ ఎగ్జిబిట్‌లో డిజిటల్ టూల్స్‌తో సైన్స్ బోధన అనే అంశంపై వీరన్న (ఉత్తనూర్) ఎంపికయ్యారు.

ఆడపిల్లల సంరక్షణ ప్రతిఒక్కరిది



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

గద్వాల రూరల్: సమాజంలో ఆడపిల్లల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన జరిగే జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై వారికి అవగాహన కల్పించడమే కాకుండా సమస్యలపై పరిష్కారం కోసం వారికున్న హక్కులపై కూడ అవగాహన కలిపించాలన్నారు. ఆడపిల్లల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని పేర్కొంటూ ఈసందర్భంగా ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ముషాయిదాబేగం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శశికళ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

ఇదివరకు వివిధ సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన ఐడీవోసీ కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. ఇందులో అత్యధికంగా భూసంబంధమైనవి ఉన్నాయని వీటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు సమావేశంలో ఆర్డీవో చంద్రకళ, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఆర్‌డీవో ఉమాదేవి ఎస్‌డీసీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

ఈనెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 28 ఫిర్యాదులు

వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు పెండింగులో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 28ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భూసంబంధ, పింఛను, సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులు పంపినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వారంలోపు పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. పరిష్కారం కాని పక్షంలో అందుకు గల కారణాన్ని పేర్కొంటూ సంబంధిత ఫిర్యాదు దారునికి అక్‌నాలెడ్జ్‌మెంట్ పంపాలన్నారు.

ఎక్సైజ్ శాఖలో అవినీతి చేప

- రూ.65 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీ
- టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీకి రూ.లక్ష డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న డీఎస్పీ



లంచం తీసుకుంటూ పట్టుపడిన నగదు, ఎక్సైజ్ సీఐ బాలాజీ

జడ్చర్ల: ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఓ అవినీతి అధికారిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి రూ.65 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ కథనం ప్రకారం.. భూత్పూర్ మండలం పోతులమడుగుకు చెందిన రేఖల తిరుపతయ్యగౌడ్ 20 ఏళ్లుగా గ్రామంలో కల్లు వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతయ్యగౌడ్ తనతో పాటు ఇద్దరు కుమారులు శ్రీకాంత్‌గౌడ్, శ్రీహరిగౌడ్ లకు టీఎఫ్‌టీ లైసెన్స్‌ల కోసం ఈ నెల 17న మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయానికి పంపారు. ఈ నెల 18న జడ్చర్ల ఎక్సైజ్ సిబ్బంది దరఖాస్తుదారులను పిలిపించి మండలంలోని గొల్లపల్లి సమీపంలో తాటి చెట్లను ఎక్కించడం తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీ దరఖాస్తుదారు తిరుపతయ్యగౌడ్‌ను లైసెన్స్‌ల జారీ కోసం రూ.లక్ష డిమాండ్ చేశాడు. దీంతో రూ.90 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని మరుసటి రోజు 19న రూ.25 వేలు ఇచ్చాడు. ఆ తర్వాత బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం మిగతా డబ్బు రూ.65 వేలు జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయంలోని తన గదిలో ఇస్తుండగానే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నగదు సీజ్ చేసి సీఐని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సీఐ బాలాజీని నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏసీబీ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు జిలాని, లింగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అది నుంచి ఫిర్యాదులే

జడ్చర్ల ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బాలాజీపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. కల్లు గీతా కార్మికుల లైసెన్స్‌ల జారీ, కల్లు విక్రయ దుకాణాల నిర్వాహకుల నుంచి మద్యం దుకాణాల వరకు పెద్దమొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జడ్చర్లలో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి నిర్వహిస్తున్న ఓ బార్ విషయంలోనూ రూ.లక్షలు చేతులు మారినట్లు సమాచారం. సీజ్ చేసినా బార్ నిర్వహణ మాత్రం యథావిధిగా కొనసాగడంపై ఫిర్యాదులు వెళ్లినా ఆయన బార్ నిర్వాహకులను వెనకేసుకు రావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి.

15 ఏళ్ల తర్వాత ఏసీబీకి..

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా ఎక్సైజ్ శాఖలో 15 ఏళ్ల తర్వాత లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో ఎక్కడా కూడా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఎవరూ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన దాఖాలు లేవు. చివరిసారిగా 15 ఏళ్ల కిందట షాద్‌నగర్ సీఐగా పనిచేసిన దాసు ఏసీబీకి పట్టుబడగా తాజాగా మళ్లీ జడ్చర్ల సీఐ పట్టుబడటం గమనార్హం. ఈ ఘటనతో ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు అంతర్గతంగా విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. గతంలో కూడా బెల్టు దుకాణాలు, దాబాలు, సారా ఇతర కేసుల్లో ఎక్సైజ్ పోలీసులు చేతివాటం చూపించిన ఘటనలు చాలా వరకు ఉన్నా.. బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం పట్టుబడిన సీఐ స్వస్థలం అచ్చంపేట నియోజకవర్గంలోని ఓ గ్రామం. కాగా.. ఈయన ఉమ్మడి జిల్లాలో చాలా ఏళ్లుగా ఎక్సైజ్ శాఖలో క్లర్క్‌గా విధులు నిర్వహించాడు. అనతికాలంలోనే సీఐగా పదోన్నతి లభించింది. ఇటీవల నల్లగొండ జిల్లాలో పనిచేసి జడ్చర్లకు బదిలీపై వచ్చారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

● పాతపాలెం, నందిన్నె గ్రామాల్లో విషాదం

కేటీదొడ్డి: విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటనలు జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో చోటుచేసుకున్నాయి. స్థానికుల వివరాల మేరకు.. పాతపాలెం గ్రామానికి చెందిన దౌలత్‌బీ (55)సోమవారం వేడినీళ్ల కోసం బకెట్‌లో హీటర్ వేసింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటి బకెట్‌కు చెయ్యి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

■ మండలంలోని నందిన్నెకు చెందిన కుర్వ భూలక్ష్మి (35) విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఇంటి ఆవరణలో తెగిపడిన సర్వీస్ వైరును పక్కనపెట్టే క్రమంలో షాక్‌కు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త గోకారప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. పాతపాలెంలో దౌలత్‌బీ, నందిన్నెలో భూలక్ష్మి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇంట్లో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో సోమవారం సాయంత్రం జ్యోతి (25) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఆర్‌సీఐ గేట్ ప్రాంతానికి చెందిన జ్యోతి, మామిళ్లపల్లికి చెందిన నేరటి శంకర్ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని గ్రామంలోనే ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, జ్యోతికి సంబంధించిన వారికి శంకర్ డబ్బులు అప్పుగా ఇచ్చిన విషయంలో తరచుగా దంపతులు గొడవపడేవారు. ఈ క్రమంలో జ్యోతి సోమవారం సాయంత్రం 3 గంటల సమయంలో తలుపులకు లోపల గడియ వేసుకుని ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కొంతసేపటికి ఇది గమనించిన భర్తతోపాటు ఇరుగు పొరుగు వారు తలుపులు తొలగించి చూడగా అప్పటికే చనిపోయి ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బాలకాశయ్య (ఫైల్)

బల్మూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన బల్మూర్ మండలం నాగర్‌కర్నూల్–అచ్చంపేట ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పోలిశెట్టిపల్లికి చెందిన పిల్లి బాలకాశయ్య (61) ఆదివారం రాత్రి అచ్చంపేట నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ.. ఏసీఆర్ గార్డెన్ ఎదుట రోడ్డుపక్కన నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు.. అతడిని 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

సంతానం కలగడంలేదని వివాహిత బలవన్మరణం

అచ్చంపేట రూరల్: సంతానం కలగడం లేదని మనస్తాపానికి గురైన ఓ వివాహిత.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లిలో చోటుచేసుకుంది. సిద్ధాపూర్ ఎస్ఐ శేఖర్‌గౌడ్ వివరాల మేరకు.. బొమ్మన్‌పల్లికి చెందిన అనూష (24)తో వెల్దండ మండలం కొట్రకు చెందిన గణేష్‌కు నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి సంతానం కలగకపోవడంతో మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు తల్లిగారి ఊరైన బొమ్మన్‌పల్లికి వచ్చిన అనూష.. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గమనించి, చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఇక్కడి వైద్యులు నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవమానించారని యువకుడు..

తెలకపల్లి: పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీలో అత్త, భార్య అవమానించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మండలంలోని బొప్పల్లికి చెందిన శంకర్ (28), వట్టిపల్లికి చెందిన శిరీష 2019లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలం నుంచి వీరి మధ్య మనస్పర్థాలు వచ్చి, గొడవలు పడుతున్నారు. పుట్టింటికి వెళ్లిన శిరీష.. కాపురానికి రాకపోవడంతో ఈనెల 20న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. భార్యతో పాటు అత్త రాములమ్మ శంకర్‌ను అవమానించడంతో ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నిర్మాణరంగం కుదేలు

● ఇసుక కొరతతో ముందుకు సాగని పనులు
● మందగించిన సామగ్రి అమ్మకాలు
● పూట గడవక కూలీల అవస్థలు


మహబూబ్‌నగర్‌లో అసంపూర్తిగా ఇంటి నిర్మాణం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఇసుక కొరతతో నిర్మాణరంగం కుదేలవుతోంది. భవన నిర్మాణాలపై ఆధారపడి జీవిస్తున్న ఎన్నో కుటుంబాలకు పనులు దొరక్క పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంటోంది. 20 రోజులుగా ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణరంగ కార్మికులతో పాటు సిమెంటు, స్టీల్ ఇతర సామగ్రి అమ్మకాలు పూర్తిగా మందగించాయి. దీంతో వ్యాపారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరత నివారణకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ వంటి పట్టణాలకు కూలీలు, మేస్త్రీలు నిత్యం భవన నిర్మాణ పనులకు వస్తుంటారు. ఇసుక కొరత కారణంగా పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 70 వేల మంది నిర్మాణరంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇసుక కొరత కారణంగా స్థానికంగా పనులు లేకపోవడంతో హైదరాబాద్ లాంటి నగరాలకు వలస వెళ్లేందుకు సిద్ధం కావడం ఆందోళన కలిగిస్తోంది.

కొత్త పనుల ప్రారంభానికి అడ్డంకి..

సంక్రాంతికి నెల రోజుల ముందు కొత్తగా నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సాధారణంగా ఎవరూ ఇష్టపడరు. అయితే సంక్రాంతి పండుగ పూర్తి కావడంతో ఇంటి నిర్మాణాలు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్న యాజమానులకు ఇసుక కొరత అడ్డంకిగా మారింది. ఇంటి నిర్మాణ అనుమతులు, ఇతర అనుమతులు పొందిన యాజమానులు.. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కుటుంబం గడుస్తలేదు..



నా పేరు ఉప్పరి మల్లేష్. మాది పెద్దదర్పల్లి గ్రామం, హన్వాడ మండలం. రోజు మేస్త్రీ పని చేస్తేనే కుటుంబం గడుస్తది. 20 రోజులుగా ఇసుక కొరత కారణంగా నిర్మాణ పనులు జరగడం లేదు. చేతిలో ఉన్న డబ్బులు పండుగకు ఖర్చయ్యాయి. పని లేకపోవడంతో కుటుంబం గడుస్తలేదు. ప్రస్తుతం పని చేసుకుంటే తప్ప కుటుంబ పోషణ గడవదు. ఇసుక కొరతను నివారించి, తమను ఆదుకోవాలి.

కార్మికులను ఆదుకోవాలి..



ఇసుక కొరతతో కొత్తగా భవన నిర్మాణాలు ప్రారంభం కావడంలేదు. కొనసాగుతున్న పనులు సగంలో నిలిచిపోయాయి. నిర్మాణరంగంపై ఆధారపడి బతుకుతున్న కార్మికులతో పాటు అనుబంధ వ్యాపారాలు చేసుకునే వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇసుక కొరతను నివారించి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి.

– బసి శ్రీను, మేస్త్రీ

మూడు ఇసుక రీచ్‌ల నుంచి సరఫరా..

జిల్లాలో ఇసుక కొరత నివారణకు మూడు రీచ్‌లను ఏర్పాటు చేశాం. అడ్డాకులలో రెండు, మూసాపేటలో ఒక ఇసుక రీచ్ కొనసాగుతోంది. మన ఇసుక వాహనం వెబ్‌సైట్‌లో ఇసుక అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా కట్టడి చేస్తున్నాం. ఇసుక కొరతను తీర్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.మోహన్‌రావు, అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్

ఇసుక అక్రమ రవాణాతోనే..

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల ఫిర్యాదు మేరకు ఇసుక అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం సఫలమైంది. ఇసుక అక్రమ రవాణా, కృత్రిమ ఇసుక తయారీపై నిఘా పెట్టిన అధికార యంత్రాంగం.. ప్రజలకు ఇసుక నిల్వలను అందుబాటులో ఉంచడంపై దృష్టి సారించడం లేదు. ఇసుక కొరతను నివారించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

దీపం కిందపడి గుడిసె దహనం


ధరూరులో కాలిపోయిన గుడిసె

ధరూరు: దేశమంతా పండుగ చేసుకుంటున్న నేపథ్యంలో.. ఆమె కూడా కుటుంబ సమేతంగా పిల్లలతో కలిసి గుడిసెలో ఏర్పాటు చేసుకున్న దేవుళ్ల, తన భర్త చిత్రపటాల వద్ద దీపాలు వెలిగించి పనులకు వెళ్లిన కొద్దిసేపటికే దీపం కిందపడి గుడిసెకు నిప్పంటుకున్న విషాదకర ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుర్వ బిందె ఆంజనేయులు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో అతని భార్య కిష్టమ్మ గుడిసె వేసుకుని ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తోంది. సోమవారం అయోధ్య రామాలయంలో రాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా కటుంబమంతా కలిసి దేవుడి చిత్రపటంతో పాటు భర్త చిత్రపటం వద్ద పూజలు నిర్వహించి దీపాలు వెలిగించింది. పొలం పనులకు వెళ్లిన కొద్దిసేపటికే గుడిసెలో నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గుడిసెలో కూలీ చేసి పిల్లల బాగోగుల కోసం దాచుకున్న రూ.20వేల నగదుతో పాటు టీవీ, ధాన్యం, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ లతీఫ్ వివరాలు తీసుకున్నారు. దాదాపు రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. అనంతరం తహసీల్దార్ వహీదాఖాతున్ ప్రభుత్వం తరపున రూ.10వేల తక్షణ సాయాన్ని అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు..

ఊట్కూరు: మండల కేంద్రంలోని ఈశ్వర్ మందిర్ ప్రాంతంలో సోమవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దహనమై శ్రీనివాస్‌కు చెందిన రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. టీవీ, బీరువా, ఫ్రిజ్, నిత్యావసర సరుకులు మంటల్లో కాలిపోయాయి.

బాలిక అదృశ్యం

మాగనూర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆదివారం మధ్యాహ్నం ఒకటి గంట ప్రాంతంలో పొలం దగ్గరకు వెళ్లి వస్తానని ఇంట్లో ఉన్న అక్కకు చెప్పి వెళ్లింది. అయితే రాత్రి అయిన ఇంటికి రాలేదని తెలిసిన ప్రాంతంలో వెతికిన ఆమె ఆచూకీ లభించలేదని , తండ్రి చంద్రప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన దాసరి నర్సింహులు బాలికను కిడ్నాప్ చేసిన అనుమానంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

మహబూబ్‌నగర్ క్రైం: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీని కించపరుస్తూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం పాలమూరులో కలకలం రేపింది. సదరు పోస్టులు స్థానికంగా ఉండే వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో బీజేపీ నేతలతోపాటు పలువురు సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేయడంతో.. సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కోస్గిలో ఆందోళన.. ఉద్రిక్తత


ఆందోళన చేస్తున్న యువకులు

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గిలో సోమవారం రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణ పురవీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టిన ఓవర్గం వారు.. తెలుగువీధికి వెళ్లే దారిలో ఉన్న ఓ ప్రార్థనా మందిరంపైకి కాగితాలు, జెండాలు విసిరారని ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ జనార్దన్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రార్థనా మందిరం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ పట్టించుకోలేదని వారు వాగ్వాదానికి దిగారు. బాధ్యులను గుర్తించి, అరెస్టు చేసే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు. కాగా ఓవైపు పట్టణంలో శోభాయాత్ర కొనసాగుతుండగా.. మరోవైపు ఇంకో వర్గం ధర్నాకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు.. జిల్లాకేంద్రం నుంచి ప్రత్యేక బలగాలను రప్పించారు. పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్పీ యోగేష్‌గౌతమ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. పట్టణంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇరుపక్షాలతో వేర్వేరుగా మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇరు వర్గాలు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు పట్టణంలో గస్తీని ముమ్మరం చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి రిమాండ్

జడ్చర్ల: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. గొల్లపల్లికి చెందిన ప్రవీణ్ హైదరాబాద్‌లోని దూల్‌పేట నుంచి గుట్టుగా గంజాయిని కొనుగోలు చేసి పట్టణ ప్రాంతంలో ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లితండా సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ప్రవీణ్‌ను పట్టుకుని విచారించగా అతని వద్ద పది గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వీటి బరువు దాదాపు వంద గ్రాములుగా ఉంది. అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మొవ్వ పురుగు ఆశిస్తే అధిక నష్టం


కాండం తొలుచు పురుగు ఆశించిన వరి పంట


వరి కాండంను తొలుచుతున్న పురుగు

పాడి-పంట
అధికారి సలహా: సక్రియ నాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వరిలో మొవ్వ పురుగు పంట నష్టం తీవ్రంగా ఉంటుంది. వరిలో నారు నుంచి పైరు పాలు పోసుకునే దశ వరకు కాండం తొలచే పురుగు ఆశిస్తుంది. ఇది సోకిన ప్రాథమిక దశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ పురుగునే మొవ్వ పురుగు అంటారని వివరించారు. ఈ పురుగు ఆశిస్తే తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఈ విధంగా వివరించారు.

పురుగు జీవిత చక్రం

తల్లి పురుగు కనీసం 300 గుడ్ల వరకు పెడుతుంది. ఒక్కొక్క గుంపులో 20 నుంచి 80 గుడ్లు ఉంటాయి. ఈ గుడ్లు 5 నుంచి 7 రోజులలో పొదిగి పురుగులు బయటికి వస్తాయి. లార్వా దశ పూర్తి కాలం 30 నుంచి 40 రోజులు ఉంటుంది. పూర్తి జీవితచక్రం 70 రోజుల్లో పూర్తవుతుంది.

నష్టపరిచే విధానం

■ చిరు పొట్ట ఏర్పడిన తర్వాత పురుగు ఆశిస్తే వెన్నులో నుంచి గింజలకు పోషకాలు అందక అవి తాలుగా మారుతాయి.
■ తల్లి రెక్కల పురుగు గుడ్లను ఆకు చివరి పైభాగంలో గుంపులుగా పెట్టి ఉదరం చివర గల వెంట్రుకలతో కప్పి ఉంచుతుంది.
■ ఈ పురుగులు గుంపులుగా మొక్కపైభాగంలో చేరి ఆకు తొడిమపై నున్న పత్రహరితాన్ని గోకి తింటాయి.
■ పూర్తిగా ఎదిగిన పురుగు వరి కాండంలో కోశస్థ దశకు చేరుకుంటాయి.
■ పైరు పిలకలు వేసే దశలో గుడ్ల నుంచి వెలుబడిన వెంటనే మొదట దశ పిల్ల పురుగులు ఆకు కొమ్మకు చేరుకుని అక్కడ పత్రహరితాన్ని గోకి తింటాయి.
■ పంటల్లో ఈ పురుగు చేసే నష్టం వలన మొక్క ఆకులు తెల్లని చారలుగా ఏర్పడతాయి.
■ ఈ పురుగు కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినటం వలన మువ్వ ఆకులు విడిపడక మువ్వ కోళ్లు ఏర్పడుతుంది.

పంటలో నివారణ చర్యలు

వరి పిలకలు తొడిగే దశలో లీటరు నీటికి 2 మి.లీ. క్లోరోఫైరిపాస్ కలిపి పిచికారి చేసుకోవాలి. అంకురం దశలో 10 నుంచి 15 రోజుల సమయంలో ఎకరానికి 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలి.
■ పురుగు మందులైతే క్లోరో ఫైరిపాస్ 2 మి.మీ, అసిఫేట్ 1.5 గ్రాములు, కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2.0 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

నారు మడి నుంచే జాగ్రత్తలు

నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడికి 170 గ్రాములు చొప్పున నీటిలో ఇసుక కలిపి నారుమడిలో చల్లుకోవాలి. నారు నాటేటప్పుడు నారు చివర్లు తుంచి వేయాలి.


ధరూరు మండలంలోని బూరెడ్డిపల్లిలో జైశ్రీరామ్ ఆకారంలో దీపాలు

శ్రీరామ జ్యోతులు

అయోధ్యలోని బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ప్రతి ఆలయం, ఇళ్ల ముందు ఐదు దీపాలు వెలిగించారు. కొందరు జై శ్రీరామ్.. అయోధ్యలోని రామమందిరం, రాముడి ఆకారాల్లో వెలిగించిన దీపాలు ఆకట్టుకున్నాయి. జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రతి ఇల్లు, ప్రతి ఆలయం దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

– సాక్షి నెట్‌వర్క్


గద్వాల కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో దీపాలతో సీతారాముల అలంకరణ


మహబూబ్‌నగర్‌లోని బండ్లగేరిలో దీపాలు వెలిగిస్తున్న బాలిక


జడ్చర్లలోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో..


అక్షర కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో..


హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఎదురెదురుగా ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గుడిపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన మల్లేష్ పనినిమిత్తం ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా గుడిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మల్లేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మామిడి తోటల పరిశీలన


కల్వకోలులో మామిడి తోటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్

పెద్దకొత్తపల్లి: మండలంలోని మామిడి తోటలను సోమవారం కొల్లాపూర్ హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణంలో మార్పుల వల్ల మామిడి పూతలకు బూడిద తెగులు, తేనెమంచు పురుగు, మసిమంగు సోకే ప్రమాదం ఉందన్నారు. తెగుళ్లు సోకి మామిడి పూతలు రాలిపోతున్నట్లు గమనిస్తే.. వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బూడిద తెగులు నివారణ కోసం తైమితాక్సిం 25, డబ్ల్యూజీ 200 గ్రాములు, ఎక్సోకోనోజల్ 5శాతం ఎస్‌సీ 500 మి.లీ. ఒక ట్రాక్టర్ డ్రమ్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొగ్గ దశలోనే తేనెమంచు పురుగు ఉధృతంగా ఉన్నట్లయితే ఇమిడాక్లోరిఫైడ్ 17ఎస్ఎల్ అనే మందును 200 ఎంఎల్, ఎక్సోకోనోజల్ 5ఎస్‌సీ 500 ఎంఎల్, బూడిద తెగులు నివారణకు ట్రోఫినోనిల్ లీటర్ నీటికి 1 ఎంఎల్, బావిస్టిన్ 500 గ్రాములను నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పూత పిందెగా మారిన తర్వాత పసుపురంగుగా మారి రాలిపోతుందని.. దీన్ని నివారణకు 13.0.45 2.5కేజీలు, ఫార్ములా4 2.5 కేజీలు ప్రొఫినోఫిక్స్ 100 ఎంఎల్‌ను డ్రమ్ము నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆయన తెలిపారు. కాయ సైజు మేరకు చెట్టుకు నీళ్లందించాలని సూచించారు. 10ఏళ్ల పైబడిన చెట్టుకు డీఏపీ 700 గ్రాములు, యూరియా 400 గ్రాములు, ఎంవీపీ 500 గ్రాముల చొప్పున వేయాలన్నారు.



హైకోర్టులో ప్రత్యేక పూజలు

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో భవ్య మందిర నిర్మాణం, రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఇందులో దాదాపు 2 వేల మంది పాల్గొన్నారని, హైకోర్టు చరిత్రలో ఇంతమందితో కార్యక్రమం జరగడం ఇదే ప్రథమమని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ పేర్కొన్నారు. కల్యాణ్‌రావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు సూర్యకరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి పులి దేవేందర్, బైరెడ్డి శ్రీనివాస్, పూర్ణశ్రీ, శారద, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి వేలమంది

ఏపీలో సమ్మె విరమణ దిశగా అంగన్‌వాడీల అడుగులు

- ఫలిస్తున్న ప్రభుత్వ సామరస్య పూర్వక యత్నాలు
- పేదలకు పౌష్టికాహారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడకుండా చర్యలు
- రాజకీయ శక్తుల చేతుల్లోకి ఉద్యమం.. 'చలో' భగ్నం



సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నించిన పార్టీల కబంధ హస్తాల నుంచి అంగన్‌వాడీలు బయటపడుతున్నారు. పునరాలోచనలో పడ్డ అంగన్‌వాడీలు సమ్మె బాట వీడి విధుల్లోకి చేరుతున్నారు. రెండు రోజులుగా రాష్ట్రంలో దాదాపు 32 వేల మంది అంగన్‌వాడీలు విధుల్లోకి చేరినట్లు సమాచారం. రానున్న రెండు రోజుల్లో మరింత మంది విధుల్లోకి రానుండటంతో విపక్షాల రాజకీయ క్రీడకు తెర పడనుంది. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 42 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సంయమనం పాటించింది. వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించి ఇప్పటికే మూడు దఫాలు చర్చలు జరిపింది. వారు ప్రస్తావించిన అన్ని సమస్యలను పరిష్కరించి వాటి అమలుకు చర్యలు చేపట్టింది. కేవలం ఒక్క డిమాండ్ వేతన పెంపుపై ప్రభుత్వం కొంత సమయం కోరింది.

స్పాన్సర్డ్ శిబిరాలు..

అంగన్‌వాడీల పేరుతో రాజకీయ పార్టీలకు చెందిన యూనియన్లు సమ్మె శిబిరాలను నిర్వహిస్తున్నాయి. పలు చోట్ల టీడీపీ నేతలు వీటిని స్పాన్సర్ చేస్తున్నారు. టెంట్లు, కుర్చీలు, భోజనాలు సమకూరుస్తూ కొన్ని శక్తులను ఆందోళనకు పురిగొల్పుతున్నారు. అంగన్‌వాడీల ముసుగులో అసాంఘిక శక్తులు ఉద్రిక్తతలు, హింసను ప్రేరేపించేలా అరాచకంగా వ్యవహరి స్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అంగన్‌వాడీల పేరుతో రాజకీయ లబ్ధి కోసం కొన్ని పార్టీలు సోమవారం 'ఛలో విజయవాడ'కు పిలుపునిచ్చాయి. శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న కుట్రలను ముందుగానే గుర్తించిన నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేశారు. అసాంఘిక శక్తుల ఉచ్చులో చిక్కుకుంటే ఇబ్బందులు తప్పవని అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చారు.

ఇటు ఆహ్వానం.. అటు ప్రత్యామ్నాయం

అంగన్‌వాడీల సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరోవైపు ప్రత్యామ్నాయ చర్యలపై కూడా దృష్టి సారించింది. విధుల్లో చేరిన వారిని కొనసాగిస్తూ ఇతర చోట్ల పేదలకు ఇబ్బందులు ఎదురు కాకుండా కలెక్టర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విధుల్లో చేరని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వర్కర్లు, హెల్పర్లను కొత్తగా నియమించేందుకు ఈ నెల 24, 25వ తేదీల్లో నోటిఫికేషన్లు జారీ చేసేందుకు పలు జిల్లాల కలెక్టర్లు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గర్భిణిలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార పంపిణీ, అత్యవసర సేవలకు అవరోధం లేకుండా ఈమేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.

24న బంద్‌కు పిలుపు

అంగన్‌వాడీల పేరుతో కొన్ని రాజకీయ పక్షాలు, యూనియన్లు తలపెట్టిన ఛలో విజయవాడ విఫలం కావడంతో ఈ నెల 24వతేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. అందుకు వామపక్ష పార్టీలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం గమనార్హం. బంద్‌కు అనుకూలంగా విజయవాడలో మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఎం ప్రకటించింది. అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది.

ఆ నష్టాన్ని కేసీఆర్ ఫ్యామిలీనే భరించాలి

- కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు
- భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో కేసీఆర్, జగదీశ్‌రెడ్డికి వాటా
- ప్రభాకరరావును అడ్డుపెట్టుకుని విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడ్డారు
- ఉచిత విద్యుత్ అమలు చేస్తాం.. సందేహం వద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, రామగిరి(నల్లగొండ): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కూలి రూ.లక్ష కోట్లు వృథా అయ్యాయని, ఆ నష్టాన్ని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబమే భరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రజలు లేఖలు రాయాలని ఆయన పిలుపునిచ్చారు. నాణ్యత లేకపోవడం వల్లే పిల్లర్లు కూలి రూ.లక్ష కోట్ల నష్టం జరిగిందన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసం నిర్మించారని ఆరోపించారు. ప్రజలు కరెంట్ బిల్లులు కట్టొద్దని కేటీఆర్ అనడం సిగ్గుచేటన్నారు. ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేద్దామని భావించామని, కానీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చూస్తే రూ.80 వేల కోట్ల అప్పుల్లో విద్యుత్ శాఖ ఉందన్న వాస్తవం తేలిందన్నారు. ప్రభాకర్‌రావును పెట్టుకుని అవినీతికి పాల్పడి విద్యుత్ శాఖను అప్పుల పాలు చేయడం వల్ల నేడు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితిలో లేదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు నిఖార్సయిన ఐఏఎస్ అధికారి రిజ్వీని నియమించామని, ఇప్పుడిప్పుడే విద్యుత్ శాఖ గాడిన పడుతోందని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తామని అందులో ఎలాంటి సందేహం లేదనీ మంత్రి భరోసానిచ్చారు.

అవినీతిపరులు జైలుకెళ్లక తప్పదు

యాదాద్రి పవర్ ప్లాంట్ రూ.29 వేల కోట్లకు డిజైన్ చేస్తే ప్రస్తుతం రూ.50 వేల కోట్లకు పెరిగిందని అది నామినేషన్ పద్ధతిన ఇచ్చి దండుకున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. మిషన్ భగీరథలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగబోతోందని, అవినీతిపరులు జైలుకు వెళ్లక తప్పదని ఆయన హెచ్చరించారు.

మూడేళ్లలో సొరంగ మార్గం పూర్తి..

మూడేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంతోపాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఎవ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీ లైనింగ్ కోసం రూ.500 కోట్లు మంజూరు చేయించామని, పనులు పూర్తయితే మరో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. నాడు బీఆర్‌ఎస్ పాలనలో ప్రగతి భవన్‌కు మంత్రులు కూడా వెళ్లే అవకాశం ఉండేది కాదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు దగ్గరుండి మరీ ప్రజాదర్బార్ ద్వారా సామాన్యుల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఇదే తేడా అని ఆయన వ్యాఖ్యానించారు.

భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రూ.10 వేల కోట్ల కుంభకోణం

భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో సగం వాటా కేసీఆర్ కుటుంబానిదైతే, సగం వాటా జగదీష్‌రెడ్డిదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తిప్పర్తి మండలం జొన్నలగడ్డ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి యాదాద్రి పవర్ ప్లాంట్ అంచనా విలువను రూ.29వేల నుంచి రూ.54 వేలకు పెంచారని నిందించారు. మంత్రి పదవి చేపట్టకముందు ఏమీ లేని జగదీష్‌రెడ్డికి వందల ఎకరాల భూమి, కోట్ల రూపాయల భవనాలు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ కుటుంబం, జగదీష్‌రెడ్డితో సహా సగం మంది జైలుకు పోవడం ఖాయమన్నారు. ఆరు నెలల్లో తమ ప్రభుత్వం కూలబోతుందని కేటీఆర్ కలలు కంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు.

సరికొత్తగా రైతు వేదికలు

అందుబాటులోకి వీడియో కాన్ఫరెన్స్‌లు

- తొలి విడతగా 110 వేదికల్లో
- ఆ తర్వాత అన్ని వేదికల్లోనూ ఏర్పాటు
- రైతులకు నేరుగా శాస్త్రవేత్తల సూచనలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు చాలాచోట్ల నిర్వహణాలోపంతో కునారిల్లుతున్న వాటిని కూడా రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు వాటిని ఆధునీకరించేందుకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా ప్రతీ జిల్లాలోని కొన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను తీసుకువచ్చారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లో అందుబాటులోకి తెచ్చారు. తదుపరి విడతల వారీగా అన్ని రైతు వేదికల్లో ఈ వీడియో కాన్ఫరెన్స్ సేవలను విస్తరిస్తారు. వీడియో కాన్ఫరె న్స్‌ల ద్వారా వ్యవసాయ, అనుబంధశాఖల అధికా రులు, శాస్త్రవేత్తలు వివిధ దశల్లో రైతులతో నేరుగా మాట్లాడి సూచనలు సలహాలు ఇస్తారు. పంటలను ఆశించే చీడ పీడలను శాస్త్రవేత్తలకు వివరిస్తారు. ఉన్నతాధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా రైతులతో సమావేశమై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పిస్తారు. మంత్రులు సైతం నేరుగా రైతులతో మాట్లాడుతారు. రైతులు కూడా తమ సమస్యలను నేరుగా విన్నవించుకునే అవకాశం కల్పిస్తారు.

ఒక్కో వేదికకు రూ. 3.72లక్షలతో వీసీ సౌకర్యం

అన్నదాతలకు సాగులో సూచనలు ఇచ్చేందుకు 2,642 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో వేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు వెచ్చించారు. ఇందులో రూ.12 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా... మిగతా రూ.10 లక్షలు ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఇచ్చారు. మొత్తంగా అన్నింటికీ కలిపి రూ.572 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిర్వహణా లోపంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని మరింత ఆధునీకరించాలని నిర్ణయించింది. రైతులకు, ప్రభుత్వానికి మధ్య సంధానంగా ఇవి ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఒక్కో రైతు వేదికకు రూ.3.72 లక్షలు ఖర్చు చేసి వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

రైతు వేదికలు ఇక ప్రజావేదికలు...

రైతు వేదికలను ఇకపై ప్రజావేదికలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులందరినీ రైతు వేదికల వద్దకు పిలిపించి వారికి అవగాహన కల్పిస్తారు. ఆ మేరకు మండల అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు రైతు వేదికల వద్ద నానో యూరియా అమ్మకాలు జరపాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఆ మేరకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వ్యవసాయశాఖకు గతంలోనే ప్రతిపాదనలు పంపింది. కానీ వ్యవసాయశాఖ మాత్రం ఈ ప్రతిపాదనకు అంత సుముఖంగా లేదనీ, ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



దావోస్ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్

నాణ్యతకు తిలోదకాలు!



అలంపూర్ క్షేత్రంలోని కుమారబ్రహ్మ ఆలయం వద్ద మరమ్మతులు (ఫైల్)

అలంపూర్ ఆలయాల్లో రూ.కోట్లతో కొనసాగుతున్న మరమ్మతు

- పనుల్లో కనిపించని నాణ్యత
- దుర్వినియోగమవుతున్న ఏఎస్‌ఐ నిధులు
- మరమ్మతుల్లో గోప్యత దేనికో?

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాల్లో ఏఎస్‌ఐ నిధులు నీళ్ల, రాళ్ల, మట్టిపాలవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.కోట్లతో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోగా.. చేసిన పనులే తిరిగి చేపడుతున్నారని ట్రస్టు సభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అలంపూర్‌లోని నవబ్రహ్మ ఆలయాలను 1958లో కేంద్ర పురావస్తుశాఖ తమ పరిధిలోకి తీసుకుంది. అప్పటి నుంచి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) వాటి మరమ్మతుకు రూ.కోట్లు వెచ్చించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం చేపట్టే పనుల వివరాలను సంబంధిత ఆలయ అధికారులకుగాని, ప్రజలకుగాని చెప్పడం లేదు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో నాణ్యత లేకపోగా ఏళ్ల తరబడి మందకొడిగా సాగుతున్నాయని, చేసిన పనులే మళ్లీ మళ్లీ చేపడుతుంటారని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ చిన్నకృష్ణయ్య ఆరోపించారు. ఏం పనులు జరుగుతున్నాయి.. ఎంత కాలం చేస్తారు.. ఏ పనులకు ఎన్ని నిధులు వచ్చాయనేది మాత్రం చెప్పడం లేదని, ఇదేమిటని అడిగితే డైరెక్టర్ జనరల్‌ను అడిగి తెలుసుకోండంటూ సమాధానమిస్తున్నారని తెలిపారు. కార్తీక మాసం వంటి ప్రత్యేక సమయాల్లో ఆలయాల్లో మరమ్మతులు చేపడుతూ భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు.

సుమారు రూ.2 కోట్లతో..

ప్రస్తుతం బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం చుట్టూ ఉన్న బండలు తొలగించి కొత్తవి వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం రూ1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల దాకా వెచ్చించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరమ్మతుకు కావాల్సిన మెటీరియల్ కూడా ఇప్పటికే సమకూర్చారు. సరిగ్గా పదేళ్ల కిందటే ఆలయం చుట్టూ బండలు వేశారు. పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో నిధులన్నీ నీళ్ల, మట్టి, రాళ్లపాలే అవుతున్నాయి. ఇప్పటికే బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం కిందిభాగం 6 అడుగులు భూమిలోకి ఉండటంతో ఆలయ సోపానాలు మట్టితో మూసుకుపోయాయి. ఆ మట్టిని తొలగించి సహజ నిర్మాణ శైలిని వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ఎదుటి భాగంలోని నంది మండపంలో ఎర్రరాతి ఆలయాన్ని డామినేట్ చేస్తూ ఇనుప గరండాలు, నల్ల బండలు వేసి ఆలయాన్ని విస్తరించడంతో సహజ ముఖద్వారం భక్తులు గుర్తించకుండా చేశారు. వీటిని తొలగిస్తే తప్పా ఆలయానికి పూర్వ వైభవం రాని పరిస్థితి. ఇక అర్క బ్రహ్మ ఆలయం లోపలి భాగంలో కూడా స్థానికంగా లభించే సాదా రాళ్లతో మినార్ వలే నిర్మాణం ఉండటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతుల కోసం ఆలయాలకు అడ్డంగా వేసిన ఇసుక



ఫ్లోరింగ్ కోసం తెచ్చిన ఎర్రరాళ్లు


నిధుల దుర్వినియోగం..



మరమ్మతుల పేరిట కేంద్ర నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేస్తున్నారు. ఏ పనులు చేపడుతున్నారు.. ఎన్ని నిధులు వచ్చాయన్న విషయం కూడా చెప్పడం లేదు. మరమ్మతుల పేరిట భక్తులను ఇబ్బందులకు గురిచేస్తూ ఆలయ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు.

– చిన్నకృష్ణయ్య, చైర్మన్, ఆలయ ట్రస్టు


పనుల్లో నాణ్యత లేదు..



ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న పనుల్లో నాణ్యత లేదు. భక్తులు, స్థానికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. ఆర్టీఐ చట్టం కింద వివరాలు కోరినా తెలివిగా కొర్రీలు పెడుతూ సమయం దాటవేస్తున్నారు.

– నాగమద్దిలేటి, పట్టణ అధ్యక్షుడు, బీజేపీ

విచారణ జరపాలి..



ఆలయంలో చేపట్టే ఏ ఒక్క పని కూడా నాణ్యతగా చేయడం లేదు. నవబ్రహ్మ ఆలయాల దగ్గర భక్తులు కాసేపు సేద తీరే వాతావరణం కూడా కల్పించడల లేదు. ఎన్ని నిధులు వచ్చాయి. పనుల నాణ్యత తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీ వేసి విచారణ చేపట్టాలి.

– శివకుమార్, భక్తుడు, మహబూబ్‌నగర్

నాసిరకంగానే..

2022–2023 ఆర్థిక సంవత్సరంలో నవబ్రహ్మ ఆలయాల ఫ్లోరింగ్, ఇతర పనులకు ఒక్కో ఆలయానికి సుమారు రూ.50 లక్షల చొప్పున రూ.4.50 కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులు నాసిరకంగా చేపట్టడంతో ఏడాది తిరగక ముందే పెచ్చులూడుతున్నాయి. అంతేగాక వర్షాకాలంలో ఆలయాల పైకప్పు నుంచి నీరంతా కిందికి చేరుకుంటుంది. ఆలయాల శిఖరాలపై ఉన్న నంది విగ్రహాలు దెబ్బతిన్నాయి. వాటిని తొలగించి కొత్త విగ్రహాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా పాతవాటికే సిమెంట్ చేసి రంగులు వేశారు. ఇప్పుడు విగ్రహాల సిమెంట్ పెచ్చులూడి యథావిధిగా తయారయ్యాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు అయ్యారా అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా 9 ఎకరాల విస్తీర్ణంలోని సంగమేశ్వర ఆలయానికి ఉన్న గ్రిల్స్ బాగున్నా.. వాటిని తొలిచించి కొత్త వాటిని బిగించే ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్న వాటికి రంగులు వేసి అవే నిధులు ఇతర అభివృద్ధి పనులకు వినియోగించాలని, ఇష్టానుసారంగా అనాలోచిత పనులు చేయొద్దని ఆలయ ట్రస్టు సూచిస్తోంది.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

- బళ్లారి సీసీ, మస్కటి ఎలెవన్ జట్ల గెలుపు
- 6 వికెట్లతో అదరగొట్టిన అష్ఫక్



బళ్లారి వర్సెస్ ఫలక్‌నుమా సీసీ మధ్య పోరు



తలపడుతున్న మస్కటి ఎలెవన్, సంగారెడ్డి జట్లు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీలో రెండో రోజు సోమవారం హోరా హోరీగా మ్యాచ్‌లు జరిగాయి. గ్రూప్–ఏ నుంచి ఉదయం సెషన్‌లో మ్యాక్స్ క్రికెట్ క్లబ్ బళ్లారి వర్సెస్ ఫలక్‌నుమా సీసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బళ్లారి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 207 భారీ స్కోర్ చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ తహ 69 (27 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లు), క్రాంతికుమార్ 53 (24 బంతుల్లో 5ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించారు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డారు. అందిన బంతినల్లా బౌండరీ లైన్ దాటించారు. ఫలక్‌నామా సీసీ బౌలర్లు అమిత్‌కుమార్‌సింగ్ 4–0–33–2, మానిక్ 2–0–28–2 వికెట్లు తీశారు. 208 పరుగులు విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఫలక్‌నామా సీసీ 12.4 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో 109 పరుగుల భారీ తేడాతో బళ్లారి సీసీ విజయకేతనం ఎగరేసింది. బళ్లారి బౌలర్ అష్ఫక్ 4–0–20–6 వికెట్లు తీసి ఫలక్‌నుమా సీసీ వెన్ను విరిచాడు. ఆది నుంచి వికెట్లు తీస్తూ కోలుకోలేని దెబ్బతీశాడు. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌ను అందుకున్నాడు. రెండో సెషన్‌లో గ్రూప్–బీ నుంచి మస్కటి ఎలెవన్ వర్సెస్ డీఎస్ ఎలెవన్ సంగారెడ్డి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మస్కటి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ రాజ్‌పూత్ 51 అర్ధసెంచరీ చేయగా, ధ్రువ 43, అబ్దుల్ బషీర్ 25 పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్లు సాయివరుణ్ 2, అబ్దుల్‌జీషాన్ , విక్రమ్ పటేల్ , ఎన్ఎస్ ఒక వికెట్ చొప్పున తీశారు. 176 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సంగారెడ్డి 16.3 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మస్కటి 58 పరుగుల తేడాతో గెలిచింది. సంగారెడ్డి జట్టులో విక్రంపటేల్ 27, రాకేష్‌నాయక్ 22, ఎన్ఎస్ 21 పరుగులు చేశారు. మిగతా బ్యాట్స్‌మెన్లు సింగిల్ డిజిట్లకే పరిమితం కావడంతో జట్టు ఓటమి పాలయ్యింది. ప్రత్యర్థి బౌలర్లు రాజ్‌పూత్ 4–0–19–4, నయూంఖాన్ 3.3–0–21–3, ఆంజనేయులు 3–0–25–2 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా రాజ్‌పుత్ నిలిచారు.



ఆరు వికెట్లు పడగొట్టిన బళ్లారి బౌలర్ అష్ఫక్

నేటి మ్యాచ్‌లు..

మంగళవారం ఉదయం సెషన్‌లో గ్రూప్–బీ నుంచి మన్నెవారిపల్లి వర్సెస్ సిటీ క్రికెట్ అకాడమీ, గ్రూప్–ఏ నుంచి గ్రీన్ సిటీ ఎలెవన్ వర్సెస్ జెడ్ ఎలెవన్ జట్లు తలపడనున్నాయని నిర్వాహకుడు చంద్రమోహన్ తెలిపారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌లను ప్లేయర్లకు టోర్నీ నిర్వాహకుడు, కౌన్సిలర్ శ్రీనివాసులు, మురళీచారి, రాహుల్‌రెడ్డి, ఖాదర్, సాధిక్ బహుమతులను అందించారు.

ముగిసిన ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు

అచ్చంపేట: ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వారంరోజుల పాటు భక్తుల సందడితో నల్లమల కొండ కళకళలాడింది. పార్వతీ పరమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా గవ్యంత పూజలు, వాస్తుపూజ, వాస్తుహోమంతో పాటు పాపనాశిని గుండం వద్ద ఉత్తరాయణ పుణ్యకాలస్నానాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు, పండితుడు వీరయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుడు

కొనసాగుతున్న నిరంజన్‌షావలీ ఉర్సు..

అచ్చంపేట మండలం రంగాపూర్‌లో నిరంజన్ షావలీ ఉర్సు కొనసాగుతోంది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు.. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు ఫాతేహాలు సమర్పించి, కందోరీలు నిర్వహించారు. దర్గా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దుకాణాలు రద్దీగా కనిపించాయి.



భక్తులతో కిటకిటలాడుతున్న నిరంజన్‌షావలీ దర్గా ప్రాంగణం

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం లావాదేవీలు ప్రారంభమవుతాయి. మూడు రోజులుగా మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగలేదు. వరుస సెలవుల వల్ల మార్కెట్ మూతబడింది. సోమవారం రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా సెలవు ఇచ్చారు. మంగళవారం యథావిధిగా టెండర్ల ప్రక్రియ జరుగుతుందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ భూముల్ని ఆక్రమిస్తే చర్యలు

కోస్గి: ప్రభుత్వ భూముల్ని ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు భూమిని స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని ముశ్రీఫాలో సర్వే నంబర్ 184లో ఉన్న ప్రభుత్వ భూమి రెండెకరాలు గ్రామానికి చెందిన కేశవులు, రామకృష్ణ ఆక్రమించి పొక్లెయిన్‌తో చదును చేయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిగా గుర్తించి వారితో పాటు పొక్లెయిన్ యజమాని పోతిరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్‌పై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా చెప్పారు.